క్లుప్తంగా

కరాటే విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: రాష్ట్రస్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి 10 బంగారు, మూడు వెండి పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. కరాటే కుంగ్‌ఫూ మాస్టర్ ఎం.రాజేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీల్లో ప్రస్తుత వేసవికాలం దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా నిర్వాహకులు, గ్రామస్థాయి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో రామ్మోహన్ కోరారు. ఎంపీడీవో బుధవారం కుక్కలగూడుర్, పుట్నూర్ గ్రామాల్లో పర్యటించి పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లోని నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం పుట్నూర్ గ్రామ శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి మధ్యాహ్న భోజన నిర్వహణ తీరును పరిశీలించారు. మండల పంచాయతీ అధికారి ఉప్పు సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వందశాతం ఇంటిపన్ను వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సతీశ్‌కుమార్

ముత్తారం: మండలంలోని కేశనపల్లి గ్రామ పంచాయతీని బుధవారం మంథని డీఎల్‌పీవో సతీశ్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేసి 100శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. చెత్త సేకరణపై గ్రామస్తులతో మాట్లాడి తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయాలని సూచించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా ఇతర అంశాలపై కార్యదర్శికి పలు సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి బూర్ల రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ టీచర్‌కు సన్మానం

ధర్మారం: మండలంలోని కమ్మరిఖాన్‌పేట ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన టీచర్ శ్రీలతను పాఠశాలలో బుధవారం సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుజ్జుల రమవేణు గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచు కుందేళ్ల కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీలతను సన్మానించారు. ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుజాత పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రామగిరి: మహిళలు కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి పొందడంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని న్యాక్ ఏడీ రమేశ్ అన్నారు. మండలంలోని కల్వచర్లలో బుధవారం రేండ్ల శారద కుమార్‌స్వామి దంపతులు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు న్యాక్ ఆధ్వర్యంలో రేండ్ల శారదతో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్ఎస్‌కే ఆపన్నహస్తం పేరిట సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. న్యాక్ శిక్షకురాలు సవిత, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, శిక్షణ నిపుణురాలు శ్యామల, స్వప్న, కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

సుల్తానాబాద్: విద్యార్థులకు నాణ్యమైన, శుభ్రమైన భోజనాన్ని వడ్డించాల్సిన బాధ్యత సిబ్బందితోపాటు వార్డెన్‌పై ఉందని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ అన్నారు. మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌లో ఉన్న ఎస్సీ, బీసీ హాస్టళ్లను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు స్టడీ రూములు, చుట్టుపక్కల పరిసర ప్రాంతాలతో పాటు వాష్‌రూమ్స్‌ను, విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం అశోక్‌నగర్, మార్కండేయ కాలనీల్లో శానిటేషన్‌ను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



పెద్దపల్లిరూరల్: విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు



కాల్వశ్రీరాంపూర్: ఆరెపల్లిలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



ఓదెల: బాయమ్మపల్లిలో జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు



సుల్తానాబాద్‌రూరల్: గర్రెపల్లిలో నివాళి అర్పిస్తున్న నాయకులు



కమాన్‌పూర్: మండల కేంద్రంలో నివాళి అర్పిస్తున్న ఛత్రపతి యువసేన సభ్యులు



యైటింక్లయిన్‌కాలనీ: వైభవంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/సుల్తానాబాద్ రూరల్/కమాన్‌పూర్/ఓదెల/జూలపల్లి/కాల్వశ్రీరాంపూర్/యైటింక్లయిన్‌కాలనీ: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు బుధవారం జిల్లావ్యాప్తంగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలు నిర్వహించారు. శివాజీ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు సూచించారు.



సుల్తానాబాద్‌లో నివాళి..

కాంగ్రెస్ గెలుపు కోసం కృషిచేయాలి

పెద్దపల్లిరూరల్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం పట్టణస్థాయి కాంగ్రెస్ నాయకులు, పట్టభద్రులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్లకు ప్రభుత్వ పథకాలను వివరించాలని సూచించారు. పెద్దపల్లి మార్కెట్ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, వైస్‌చైర్మన్ కూర మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు కడార్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు భూషణవేని సురేశ్ గౌడ్, నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు కాంగ్రెస్‌తోనే సాధ్యం

కాల్వశ్రీరాంపూర్: ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో బుధవారం కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, పట్టభద్రులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

మాట్లాడారు. విద్యావేత్త డాక్టర్ వూట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమైందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి వీఎన్ఆర్ టీం మల్లేశ్‌గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు సతీశ్, సదానందం, సజ్జు, మొగిలి, దేవేందర్‌రావు, సత్యనారాయణరెడ్డి, నాయకులు మోహన్, మొండయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను తుంగలో తొక్కారు

గోదావరిఖని: ఆరు గ్యారంటీల పేరుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలను తుంగలో తొక్కిందని, రాష్ట్రంలో హైడ్రా పేరుతో కూల్చివేస్తుంటే రామగుండంలో అభివృద్ధి పేరుతో కూల్చివేతలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు కౌశిక హరి ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి ప్రణాళిక, డీపీఆర్ లేకుండా కూల్చివేతలు చేస్తున్నారన్నారు. వ్యాపారులు, ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. డివిజన్లలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి గెలిచారని, అందులో ఒక్కటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. ఎన్టీపీసీలో



మాట్లాడుతున్న కౌశిక హరి

ఉద్యోగాల దందా సాగుతుంటే కేంద్రం, ఎన్టీపీసీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు మాదాసు రామ్మూర్తి, జోసఫ్, వెంకటేశ్, స్వప్న, కిషన్, సర్వర్‌పాషా, రాంబాబు, మున్నా, కుమార్ పాల్గొన్నారు.

వీరత్వానికి ప్రతీక ఛత్రపతి శివాజీ



పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: జాతివీరత్వానికి ప్రతీకగా ఛత్రపతి శివాజీ నిలుస్తారని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శివాజీ జయంతిని పురస్కరించుకుని స్థానిక జీఎం ఆఫీస్ వద్ద గల శివాజీ విగ్రహానికి బుధవారం ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు మహంకాళి స్వామి, ఎండీ ముస్తఫా, గట్ల రమేశ్, మారెల్లి రాజిరెడ్డి, ప్రయివేట్ పాఠశాలల సంఘం అధ్యక్షుడు సమ్మారావు పాల్గొన్నారు.

పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

గోదావరిఖని: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించిన పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య కోరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. రెండేళ్ల క్రితం నిర్వహించిన భూపోరాటంలో ఇళ్లు లేని పేదలు సుమారు 600మంది ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. వారికి మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి కనీస సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. నాయకులు వేల్పుల కుమారస్వామి, ఎ.మహేశ్వరి, ఎం.రామాచారి, నాంసాని శంకర్, మేదరి సారయ్య, ఎస్.భిక్షపతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గోదావరిఖని: స్థానిక బేస్‌వర్క్‌షాప్‌లో జరిగిన కార్యక్రమంలో బుధవారం కమిన్స్ సర్వీస్ ఇంజనీర్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన సంజీవ్‌కు రూ.52వేలు హెచ్‌వోడీ సత్యనారాయణ చేతుల మీదుగా అందించారు. నాయకులు నక్క రమేశ్, ఎనగందుల సదానందం, శ్రీనివాస్. రఘుకుమార్, జక్కుల దామోదర్‌రావు, పూర్ణాకర్, కాంతాల కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగాలి



విద్యార్థులకు బహుమతి అందజేత

గోదావరిఖని: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని అందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆర్జీ–1 సేవా అధ్యక్షురాలు అనిత, సింగరేణి పాఠశాలల ఎడ్యుకేషనల్ సెక్రటరీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక సెక్టార్–2 సింగరేణి పాఠశాల 49వ వార్షిక వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి పాఠశాలలో నాణ్యమైన విద్యను తక్కువ ఫీజులతో అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, పర్సనల్ డీజీఎం కిరణ్‌బాబు, లేడీస్ క్లబ్ సెక్రటరీ చిలుక లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• మున్సిపల్ బిల్లులు చెల్లించాలి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీకి బకాయి ఉన్న బిల్లులను వెంటనే చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ప్రతీఒక్కరు నల్లా బిల్లులు తప్పనిసరిగా చెల్లించాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ నరేశ్, బిల్ కలెక్టర్ రాజేందర్ ఉన్నారు.

• పేకాటస్థావరంపై పోలీసుల దాడి

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓదెల గ్రామశివారులో హరిపురం రోడ్డువైపు పేకాట ఆడుతున్న 9మందిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై దికొండ రమేశ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7100 నగదు, 3 ఫోన్లు, నాలుగు టూవీలర్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెల్లడించారు.

• రవాణాశాఖపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం

మంథని: రవాణా శాఖ సేవలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని జిల్లా ఆర్టీవో నాన్ అఫీషియల్ సభ్యుడు మంథని సురేశ్ తెలిపారు. పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఆర్టీవో ఆఫీస్ స్థల సేకరణకు 7 ఎకరాల అవసరం ఉందని, అందుకు మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సురేశ్ తెలిపారు.

• శివాజీ విగ్రహం ఏర్పాటు చేయండి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఏరియాలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు సోమారపు లావణ్యఅరుణ్ బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. నాయకులు శివాజీ, రవీందర్, కిషన్, అశోక్, స్వామి స్వరూప, సునీల్, శ్రావణ్ ఉన్నారు.

• సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి

ముత్తారం: విద్యార్థులందరూ చదువుపై దృష్టి పెట్టాలని, సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని మండల విద్యాధికారి హరిప్రసాద్ తెలిపారు. దర్యాపూర్ ఆదర్శ పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. కాంప్లెక్స్ హెచ్.ఎం .రాజేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌కుమార్, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

• మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులో ఉన్న వేములవాడ అనుబంధ దత్తత ఆలయమైన శ్రీనాగలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా ఆహ్వాన పత్రికను బుధవారం ఆవిష్కరించారు. 25 నుంచి 26 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

• ధర్నా విజయవంతం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: హైదరాబాద్‌లో 20న నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి బి.అశోక్ పిలుపునిచ్చారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలో బుధవారం కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు.

• కుక్కల దాడిలో మేకలు మృతి

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌లో ఇంటి ఆవరణలో ఉంచిన మేకలపై అర్ధరాత్రి కుక్కలు దాడి చేయడంతో ఆరు మేకలు మృత్యువాత పడ్డాయి. కాచాపూర్ గ్రామానికి చెందిన మేకల యజమాని ఆవుల ఐలయ్య యాదవ్ కథనం ప్రకారం ఆరు మేకలను ఇంటి ఆవరణలో ఉంచారు. గ్రామంలో తిరిగే కుక్కలు అర్ధరాత్రి దాడి చేసి నాలుగు మేకలను చంపివేయగా మరో రెండింటిని ఎత్తుకెళ్లాయి. నిద్ర నుంచి మేల్కొని చూడగా నాలుగు చనిపోయి ఉండగా మరో రెండు కనిపించకుండా పోయాయని బాధితుడు ఐలయ్య బోరున విలపించాడు. నెల క్రితం రూ.40వేలు పెట్టి కొన్నానని, కుక్కలు దాడి చేయడంతో నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలానికి మాజీ సర్పంచ్ అడప లక్ష్మన్ వచ్చి పరిశీలించారు. అధికారులు కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.


• ఉపాధిహామీ కూలీల నిరసన

ఎలిగేడు: ఉపాధిహామీ పనులు చేస్తున్న తమకు కూలీ డబ్బులు తక్కువగా పడుతున్నాయని, సక్రమంగా పడడంలేదని బుధవారం ఉపాధిహామీ కూలీలు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో భాస్కర్‌రావుకు విన్నవించారు. ఎంపీడీవో కూలీలతో కలిసి పనిచేస్తున్న చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. ట్రాక్టర్లలో నిర్ణీత ట్రిప్పుల మట్టిని నింపాలని, అలా అయితేనే ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం కూలీడబ్బులు పడతాయన్నారు.

• ఫోన్ హ్యాక్‌పై ఫిర్యాదు

మంథని: ఓ పేరుతో సోషల్ మీడియాలో అశ్లీల చిత్రాలు పోస్టు కావడంతో వాట్సాప్ యూజర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చాలా గ్రూపుల్లో పోస్టు కావడంతో ఆ పేరుతో వచ్చిన నంబర్‌కు కాల్ చేయగా తన ఫోన్ హ్యాక్ అయిందని, దీంతో సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

వ్యాపార కూడళ్లలో సీసీరోడ్డు పనులు ప్రారంభం



కొనసాగుతున్న నిర్మాణ పనులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని వ్యాపార కూడళ్లలో ఎట్టకేలకు బుధవారం నుంచి సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొంతకాలంగా డాక్టర్స్ స్ట్రీట్ నుంచి కళ్యాణ్‌నగర్ వరకు, కళ్యాణ్‌నగర్ నుంచి మేదరిబస్తీ రోడ్డులో యూజీడీతోపాటు తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుతో రోడ్లన్నీ తవ్వడంతో అస్తవ్యస్తంగా మారింది. నిత్యం దుమ్ముతో వ్యాపారస్తులతోపాటు స్థానికులు, వాహనదారులు నరకయాతనకు గురవుతున్నారు. తొలుత స్థానిక సీటీస్కాన్ కూడలి నుంచి కళ్యాణ్‌నగర్ వరకు ఒకవైపు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను బీహార్ తదితర రాష్ట్రాలకు చెందిన వారితో చేయిస్తున్నారు. దశలవారీగా పనులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

సింగరేణి వార్తలు

ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమ్మె విరమణ

గోదావరిఖని: సింగరేణి ఓబీ కాంట్రాక్టు కార్మికుల సమ్మె విరమించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ సమక్షంలో జరిగిన చర్చలు సఫలం అయ్యాయి. ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య, ఓబీ కంపెనీల ప్రతినిధులు పీసీ పటేల్, ఆర్‌వీఆర్, వీ9, సీ5, హెచ్ఆర్ ప్రతినిధులతో కార్మికులు ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం డ్రైవర్లకు ఇప్పుడున్న బేసిక్ వేతనం పెంచేందుకు అంగీకరించారు. హెల్పర్లకు ఇప్పుడున్న బేసిక్ మీద రూ.1680 పెంచారు. మిగతా కార్మికులకు నిష్పత్తి ప్రకారం పెంచినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, ఉప



సన్మానిస్తున్న ఓబీ కార్మికులు

ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సహకారంలో నియోజకవర్గంలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి

రామగిరి: సింగరేణి సంస్థలో ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని ఆర్జీ–3 జీఎం నరేంద్ర సుధాకర్ రావు అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న హైదరాబాద్ మార్కెట్ విభాగం జీఎం డి.రవిప్రసాద్‌ను బుధవారం జీఎం కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. సింగరేణి సంస్థలో 39ఏళ్లుగా రవిప్రసాద్ ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించారని, అంకితభావంతో అందించిన సేవలు ఎంతో మందికి ఆదర్శమని కొనియాడారు. ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారి సీ.హెచ్.వెంకట



సన్మానిస్తున్న జీఎం ఎన్.సుధాకర్‌రావు

రమణ, అధికారులు కె.చంద్రశేఖర్, రాజారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, బి.సుదర్శనం, ఐలయ్య, నాగేశ్వరరావు, షబ్బీరుద్దీన్, ఆర్.రాజేశ్వరి పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు బుధవారం జీఎం ఎన్.సుధాకర్‌రావు ఆదేశాల మేరకు క్వార్టర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. 179 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కోసం 88 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం తెలిపారు. 38 మంది ఉద్యోగులు హాజరై 34 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రారెడ్డి, సాయికృష్ణ, ఎస్టేట్ అధికారి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్యామల, సివిల్ అధికారి ఫణీంద్ర, డీవైపీఎం సునీల్ ప్రసాద్, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సదయ్య పాల్గొన్నారు.

సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్‌కు సన్మానం

గోదావరిఖని: సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణను బీసీ సంఘం నాయకులు బుధవారం సన్మానించారు. స్థానిక ఇల్లెందు క్లబ్‌కు వచ్చిన ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు చిలుక శ్రీనివాస్, వసంత్‌కుమార్, దేవాచారి, దేవులపల్లి రాజేందర్, మండ రమేశ్, పెంచాల తిరుపతి, మధుబాబు పాల్గొన్నారు.



డైరెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఏరియా ఆసుపత్రిలో పిల్లల డాక్టర్‌ను నియమించాలి

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో పిల్లల డాక్టర్‌ను నియమించాలని టీబీజీకేఎస్ నాయకులు మాదాసు రామ్మూర్తి, వడ్డేపల్లి శంకర్ కోరారు. ఏరియా ఆసుపత్రి ఏసీఎంవోకు బుధవారం వారు వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం తర్వాత ప్రధాన ఆసుపత్రిగా కొనసాగుతున్న గోదావరిఖని ఏరియా ఆస్పత్రిలో పిల్లల వైద్యులు లేక సింగరేణి ఉద్యోగుల పిల్లలు ఇబ్బంది పడుతున్నారన్నారు. రామకృష్ణాపూర్ ఏరియా హాస్పిటల్ నుంచి పిల్లల వైద్యులు మూడు రోజులు ఇక్కడకు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. పిల్లలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నాయకులు చెల్పూరి సతీశ్, దూట శేషగిరి, అంజయ్య, శ్రీనివాస్, మల్లేశ్, జోసెఫ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



జూలపల్లి: అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జూలపల్లి: మండలంలోని వడ్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కాట జన్విత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. పెద్దపల్లిలో నిర్వహించిన సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైట్లు హెచ్‌ఎం దూస రమేశ్ తెలిపారు. ఈ నెల 20 నుంచి 23 వరకు వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. జన్వితను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.




ఎలిగేడు: అభినందిస్తున్న ఎంఈవో, టీచర్లు

ఎంపికైన సుల్తాన్‌పూర్ విద్యార్థి

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి కనుకుంట్ల అరవింద్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో అనసూరి నరేంద్రచారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 15న నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. పాఠశాలలో బుధవారం ఎంఈవో, జిల్లా కబడ్డీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ అరవింద్‌ను అభినందించారు.

ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఎన్నిక



నెలకంటి రాము

గోదావరిఖని/ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మిక సంఘం ఎన్నిక బుధవారం స్థానిక మార్కండేయకాలనీలోని దుర్గానగర్‌లో జరిగింది. 250మంది కాంట్రాక్టు కార్మికుల సంతకాలతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్, అధ్యక్షుడిగా నెలకంటి రామును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మిగతా కమిటీని ఆర్ఎఫ్‌సీఎల్ కార్మికుల సెక్షన్ వైజ్‌గా ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు. గ్రామాలు, కార్పొరేషన్‌కు సంబంధించిన మాజీ ప్రజా ప్రతినిధులతో పాటు పూర్తి కమిటీని ప్రకటిస్తామన్నారు. ఎల్కలపల్లి మాజీ సర్పంచ్ రాజ్‌కుమార్, సతీశ్, శ్రీను, శంకర్, మల్లేశ్, అంజి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.